సాక్షి శ్రీకాకుళం

సోమవారం ॥ 9 ॥ డిసెంబర్ ॥ 2024



డిజిటల్ అరెస్ట్.. బీ అలెర్ట్

సైబర్ నేరాలు మితిమీరుతున్నాయి. జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. - 8లో



స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

ఎచ్చెర్ల మండల పరిధిలో ఓ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. డ్రైవర్ చనిపోయారు. - 8లో

క్రికెట్ మైదానానికి భూమి పూజ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (అటానమస్) కళాశాల మైదానాన్ని క్రికెట్ కార్యకలాపాల కోసం ఏపీఏ సూచనలతో జిల్లా క్రికెట్ సంఘం ఇటీవలే ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో మైదానాన్ని తీర్చి దిద్ది, ఆధునీకరణ పనులు మొదలుపెట్టేందుకు ఆదివారం ఆంధ్రా క్రికెట్ సంఘం ఆదేశాల మేరకు జిల్లా క్రికెట్ సంఘం భూమి పూజను చేపట్టింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ముగిసిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో ఆదివారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు 21 కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. 4908 మంది ఈ పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 4792 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 116 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య, ఏసీ లియాఖత్ ఆలీఖాన్ తదితరులు పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నేషనల్ లెవల్‌లో నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.12వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందజేసేందుకు ఎంపిక కోసం కోసం ప్రతి ఏటా ఈ పరీక్ష జరుగుతున్న విషయం తెలిసిందే.

ఒక్క రోజులో రూ.4,73,650 ఆదాయం



రామకృష్ణ ప్రసాద్‌కు స్వామి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు, అన్నదాన ప్రసాదం అందేలా సూపరింటెండెంట్ కనకరాజు ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఏపీ ట్రాన్స్‌కో ఎస్పీ రామకృష్ణ ప్రసాద్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వై.భద్రాజీ, ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజులు స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాన్ని రామకృష్ణప్రసాద్‌కు అందజేశారు. ఆదిత్యునికి వివిధ దర్శనాల ద్వారా టికెట్ల రూపేణా రూ.2, 06, 600, పూజలు, విరాళాల ద్వారా రూ.72,050, ప్రసాదాల రూపేణా రూ.1.95లక్షలు ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ వై.భద్రాజీ తెలిపారు.

ఒరియా విద్యకు ప్రోత్సాహం



ఒడియా స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కంచిలి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఒరియా విద్యకు అవసరమైన ప్రోత్సాహాన్ని ఇక్కడి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి అందిస్తామని ఒడిశా రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సురమాపాఢి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఒరియా టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కంచిలి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 10వ మేధాసమ్మాన్ వారోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఒడిశా రాష్ట్ర వాణిజ్య, రవాణా, స్టీల్, మైన్స్ శాఖల మంత్రి బిభుతి భూషన్ మాట్లాడుతూ.. ఒరియా విద్యకు అవసరమైన మెటీరియల్‌ను అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఒడియా విద్యకు గల అవరోధాలను ఒడియా టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చి, పరిష్కరించాల్సిందిగా కోరడంతో హాజరైన ప్రజాప్రతినిధులు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్సీ నర్తు రామారావు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి, డీఈఓ తిరుమల చైతన్య ఆవిష్కరించారు. అయిషా మహంతి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

ఆందోళనలో అన్నదాతలు

వజ్రపుకొత్తూరు రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో వస్తున్న మార్పులు అన్నదాత గుండెల్లో గుబులు రేపుతున్నాయి. పండించిన పంట చేతికి అందుతున్న తరుణంలో ఈ మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి కోతలు, నూర్పులు చేస్తున్నారు. అయితే వారం రోజుల కిందట కురిసిన వర్షాలతో పంట కొంత వరకు నష్టపోయింది. మళ్లీ ఇప్పుడు మరో ముప్పు ముంచుకు వస్తుండడంతో తాము పండించిన పంట నష్టపోయే పరిస్థితి ఉందని తమకు కంటిమీద కునుకు లేకుండా పోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



అక్కుపల్లి తీరంలో కడలి కల్లోలం

అతివల ఆట.. ప్రగతి బాట



ఐపీఎల్ వేలం తర్వాత త్రిపురాన విజయ్ పేరు జిల్లాలో అందరికీ తెలిసిపోయింది. కాస్తాకూస్తో మరో ఇద్దరు ముగ్గురు క్రికెట్ ఆటగాళ్లు కూడా కాస్త పేరు సంపాదించారు. వీరిలాగానే జిల్లాలో కేవీఎస్‌పీ చందన, ఎం.హారికాయాదవ్, భానుమతి, యడ్ల రమణమ్మ, బి.నవ్య, కె.వింద్య, కావ్య, కుముదుని వంటి మహిళా క్రికెటర్లు ఉన్నారు. కానీ పురుషులకు వస్తున్న గుర్తింపు వీరికి రావడం లేదు. ఇకపై ఈ పరిస్థితి మార్చేందుకు పకడ్బందీ ప్రణాళికలు రచిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని వుమెన్స్ కాలేజీతో క్రికెట్ సంఘ పెద్దలు ఎంఓయూ కూడా కుదుర్చుకున్నారు.

- జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి జిల్లా క్రికెట్ సంఘం పకడ్బందీ చర్యలు
- పురుషులతో పాటు మహిళా క్రికెట్‌ను మరింతగా ప్రోత్సహించాలని నిర్ణయం
- శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలతో ఎంఓయూ కుదుర్చుకున్న జిల్లా క్రికెట్ సంఘం
- మైదానంలో క్రికెట్ నెట్స్, మైదానం అభివృద్ధికి చర్యలు



శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మైదానం ఇదే

శ్రీకాకుళం న్యూకాలనీ:

మహిళల క్రికెట్‌ను ప్రోత్సహించే ప్రక్రియ మొదలైంది. మహిళల కోసం ప్రత్యేకంగా క్రీడా మైదానాన్ని జిల్లా క్రికెట్ సంఘం సిద్ధం చేస్తోంది. క్రికెట్ నెట్స్‌ను ఏర్పాటు చేస్తోంది. దీనికితోడు ఎంఓయూను కుదుర్చుకుని దూకుడుగా అడుగులు వేస్తోంది. ఐపీఎల్ కుర్రాడు త్రిపురాన విజయ్ స్ఫూర్తితో జిల్లాలో క్రికెట్ కార్యకలాపాలను పూర్తిస్థాయిలో విస్తరించాలని జిల్లా క్రికెట్ సంఘం నిర్ణయించింది. టెక్కలికి చెందిన విజయ్‌ను ఇటీవలి ఐపీఎల్ 2025 వేలంలో ఢిల్లీ క్యాపిటల్ రూ.30లక్షలు వెచ్చించి కొనుకున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది మరో ముగ్గురు క్రీడాకారులను ఐపీఎల్‌కు చేరువ చేయాలనే లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నారు. అయితే ఇదే క్రమంలో మహిళా క్రికెట్‌ను సైతం విస్తరింపజేయాలని నిర్ణయించారు. జిల్లాలో ఇప్పటికే కేవీఎస్‌పీ చందన, ఎం.హారికాయాదవ్, భానుమతి, యడ్ల రమణమ్మ, బి.నవ్య, కె.వింద్య, కావ్య, కుమిదిని వంటి క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించి మెరిశారు. వీరితోపాటు మరి కొంతమంది జోనల్‌స్థాయిలో ఆడి రాణించారు. అనంతరం వారికి ప్రోత్సాహం కరువవ్వడంతో క్రమేపీ ఆటకు దూరమయ్యారు. మళ్లీ వీరందరితోపాటు ఫ్యూచర్ మహిళా క్రికెటర్లను గుర్తించే పనిలో జిల్లా క్రికెట్ సంఘం నిమగ్నమైంది.



శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మైదానం కోసం ఎంఓయూ

మహిళా కళాశాలతో ఎంఓయూ..

మహిళా క్రికెట్‌ను కార్యకలాపాలను విస్తరించే ప్రయత్నంలో శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మైదానం కోసం జిల్లా క్రికెట్ సంఘం ఎంఓయూ చేసుకుంది. అక్కడి కళాశాల ముఖద్వారం వద్ద ఉన్న మైదానాన్ని అభివృద్ధి చేసి, క్రికెట్ నెట్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. వివిధ కళాశాలలతోపాటు పాఠశాలల్లో బాలికలకు మహిళా క్రికెట్‌పై అవగాహన కల్పించి వారిని ప్రోత్సహించాలని భావిస్తున్నారు. పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తున్నారు.

నేను సైతం



జిల్లాలో మహిళా క్రికెట్‌ను విస్తరించాలని భావించిన జిల్లా క్రికెట్ సంఘానికి హాట్సాఫ్. ఇందుకోసం శ్రీకాకుళం ఉమెన్స్ కాలేజ్ మైదానాన్ని, అక్కడే క్రికెట్ నెట్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మేమంతా ప్రిన్సిపాల్‌తో కలిసి మైదానాన్ని పరిశీలించాం. మహిళా క్రికెట్ కోసం నా వంతుగా నేను సైతం మహిళా క్రికెట్‌కు అభివృద్ధికి బాసటగా ఉంటాను.

– మన్నెల హారికాయాదవ్,
జూనియర్ ఇండియా ప్రాబబుల్స్ ప్లేయర్

క్రికెట్ కార్యకలాపాలు విస్తరిస్తున్నాం.



జిల్లాలో క్రికెట్ కార్యకలాపాలను విస్తరిస్తున్నాం. గత సంఘం జిల్లాలో క్రికెట్‌ను నీరుగార్చింది. మేము ఏర్పాటయ్యాక ఏసీఏ నుంచి తొలినాళ్లలో ఎలాంటి సహకారం లేకపోయినప్పటికీ.. సొంతడబ్బులు వెచ్చించి క్రికెట్ కార్యలాపాలను, రెసిడెన్షియల్ కోచింగ్ క్యాంప్‌లను నిర్వహించాం. గత రెండేళ్లుగా జిల్లా నుంచి ఎంతో మంది క్రీడాకారులు అంతర్‌రాష్ట్ర, ఆంధ్రా జట్లకు ఎంపికయ్యారు.

– పీవైఎస్ శాస్త్రి,
జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు

మహిళా క్రికెట్‌కు మంచిరోజులు..



శ్రీకాకుళం జిల్లాలో మహిళా క్రికెట్‌కు మంచిరోజులొచ్చాయని సంతోషంగా చెబుతున్నాం. వీరి కోసం శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాలతో జిల్లా క్రికెట్ సంఘం ఎంఓయూ కుదుర్చుకుంది. క్రికెట్ నెట్స్ ఏర్పాటుచేస్తాం. మైదానాన్ని తీర్చిదిద్దుతాం. ఉదయం, సాయంత్రం శిక్షణను అందిస్తాం.

– ఇలియాస్ మహ్మద్,
జిల్లా క్రికెట్ సంఘం మెంటార్, సీనియర్ క్రికెటర్

ఎంఓయూ కుదుర్చుకోవడం వాస్తవమే..



శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాల మైదానంలో మహిళా క్రికెట్ కార్యకలాపాలను నిర్వహిస్తామని ముందుకొచ్చిన జిల్లా క్రికెట్ సంఘ ప్రతినిధులను సాదరంగా ఆహ్వానించాం. సంఘంతో ఎంఓయూ కుదుర్చుకోవడం వాస్తవమే. బాలికల క్రికెట్ మరింతగా బాగుపడాలి. అది మా కళాశాలలో జరుగుతుండం అభినందనీయం.

– డాక్టర్ కె.సూర్యచంద్రరావు,
జీడీసీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాకుళం

మహిళా క్రికెట్ అభివృద్ధికి పక్కాగా ముందుకు..



జిల్లా కేంద్రంలో మహిళా కళాశాలతో జిల్లా క్రికెట్ సంఘం ఎంఓయూ కుదుర్చుకోవడం చాలా సంతోషదాయకం. బాలికలు, మహిళల క్రికెట్ అభివృద్ధి కోసం పక్కాగా ప్రణాళికతో అడుగులు వేస్తున్నారు. దూరదృష్టితో వ్యవహరిస్తుండటం గొప్ప విషయం.

– యడ్ల రమణమ్మ,
మహిళా క్రికెట్ కోచ్

రైతు సమస్యలపై 13న జిల్లా కేంద్రంలో ర్యాలీ

- కూటమి ప్రభుత్వంలో రైతులకు తీరని అన్యాయం
- పార్టీ శ్రేణులు తరలిరావాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: రైతు సమస్యలపై ఈ నెల 13న శ్రీకాకుళంలో ర్యాలీ నిర్వహించనున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి అధికారం చేపట్టాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. రైతులకు ఇస్తామన్న రైతు భరోసా ఇంత వరకూ కూటమి ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే డబ్బులతోనే రైతులు సరిపెట్టుకోవాల్సి వచ్చిందన్నారు. ఎన్నికల ముందు రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చిన నాయకులు ఇప్పుడు పట్టించుకోవడం లేదని, ఖరీఫ్ కూడా అయిపోయిందన్నారు. ఖరీఫ్ ఆరంభంలో అన్నదాతలు పెట్టుబడి కోసం నానా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఇప్పటికీ రైతులను మభ్య పెట్టేందుకే చూస్తున్నారని విమర్శించారు. విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందించలేదని మండిపడ్డారు. పండిన ధాన్యం విక్రయించేందుకు కూడా అవస్థలు ఎదురవుతున్నాయని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. రబీ పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం భారం రైతులపై మోపడం దారుణమన్నారు. సరైన సమయానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేక పోవడంతో రైతులు తుఫానుకు నష్టపోయారని అన్నారు. రైతులకు అండగా ఉండేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ర్యాలీకి జిల్లాలోని మేధావులు, ఇతర పక్షాలు కలిసిరావాలని కోరారు.

కలిసికట్టుగా పోరాడదాం..



సమావేశానికి హాజరైన రెండు మండలాల బాధిత కుటుంబాలు

మందస మండలం బిడిమి గ్రామంలో ఉద్దానం తీరప్రాంత భూ పరిరక్షణ కమిటీ కన్వీనర్ కొమర వాసు నేతృత్వంలో మందస, వజ్రపుకొత్తూరు మండలంలోని ఎయిర్‌పోర్టు భూ బాధిత కుటుంబాల వారు ఆదివారం సమావేశమయ్యారు. రైతులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకి అతీతంగా అందరం ఏకమై ప్రతి గ్రామం నుంచి నష్టపోతున్న రైతుల తరఫున ఒక కమిటీ ఏర్పాటు చేసి భవిష్యత్‌లో పోరాటం చేయటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మాటలకు, చేతలకు పొంతన లేని ఈ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి ప్రజల్లో అనేక ప్రశ్నలు, అనుమానాలని రేకెత్తిస్తోందని అన్నారు. ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా ఈ కార్గో ఎయిర్‌పోర్టు ప్రక్రియను అభివృద్ధి అని ఎలా అనగలమని ప్రశ్నించారు. ఎవరికి నచ్చిన రాజకీయ పార్టీకి వాళ్ల మద్దతు ఇచ్చుకోండి గానీ పోరాటం మాత్రం కలిసి చేద్దామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పొట్టి ధర్మారావు, జోగి అప్పారావు, ఎంపిటీసీ తిర్రి రాజారావు, నాయకులు బత్తిని లక్ష్మణరావు, చిత్త కూర్మారావు, చిత్త గున్నయ్య, దున్న రామారావు, తామాడ తుంభనాధం, గుంటు లోకనాథం, దున్న సింహాచలం, బత్తిని ఉమాపతి, జుత్తు హేమరాజు, గార ఆనంద్, మడియా రుషి, బత్తిని దేశయ్య, దున్న హరికృష్ణ, మర్ల సంతోష్, మామిడి తులసయ్య, కొండ వాసు, తామడ రమేష్, నల్ల పరుసరామ్, మహిళలు, యువకులు, మేధావులు పాల్గొన్నారు.

–కాశీబుగ్గ

నేడు జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి సీనియర్స్ పురుషుల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు సోమవారం జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ ఎంపికలు జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం మైదానంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి మొదలవుతాయని చెప్పారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్టును ఈనెల 13 నుంచి 15 వరకు అనంతపురం జిల్లా కల్యాణదుర్గ వేదికగా జరగనున్న 10వ ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్‌జిల్లాల) సీనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు పంపించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వయోవిభాగంతో సంబంధం లేకుండా ఎంపికలకు హాజరుకావాలని కృష్ణకుమార్, చంద్రశేఖర్ అన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9440001616 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



ద్రౌపతి నృత్య రూపకంలో ప్రదర్శన

ఆద్యంతం ఆసక్తిదాయకం

శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో పాతికేళ్ల రజతోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు ఆదివారం బాపూజీ కళామందిర్‌లో కల్లేపల్లి సంప్రదాయం డైరెక్టర్ స్వాతి సోమనాథ్ ఆధ్వర్యంలో చిన్నారుల ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. మహా భారతంలో ద్రౌపది ఎదుర్కొన్న అవమానాలు, కష్టాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. 22 మంది సంప్రదాయం చిన్నారులు ఈ ప్రదర్శనలో పాల్గొనగా ద్రౌపదిగా యామిని కసిరెడ్డి ప్రదర్శన అలరించింది. అనంతరం ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ చక్కనైన రెండు గీతాలను చక్కగా ఆలపించారు. త్వరలో తాను 100 భాషల్లో పూర్తి భగవద్గీత గానం చేస్తున్నానని ఇప్పటికే 25 భాషల్లో పూర్తయ్యిందన్నారు. రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షులు చిట్టి వేంకటరావు ఆధ్వర్యంలో జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ కళలను బతికిస్తున్న కళాకారుల వైభవాన్ని వర్ణించారు. ఈ సందర్భంగా రంగస్థల కళాకారులకు ఆర్థిక సాయం అందిస్తున్న దాతలను, దివంగత కళాకారుల సతీమణులను సత్కరించారు. గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ ప్రదర్శించిన 'ఇది అతని సంతకం' నాటకం అలరించింది. కార్యక్రమంలో ఈఈ పొగిరి సుగుణాకరరావు, గార ఎంపీపీ గొండు రఘురాం, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, జె.దాశరధి శ్రీనివాస్, బలివాడ మల్లేశ్వరరావు, డీపీఐ ఆర్‌ఓ కె.చెన్నకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రంగస్థల మాజీ కళాకారులు కేఎస్ భాస్కరరావు సతీమణి కుప్పిలి ప్రమీలారాణిని సత్కరిస్తున్న దృశ్యం

– శ్రీకాకుళం కల్చరల్

వెళ్లొస్తాం..




నిన్నటి వరకు తేలుకుంచిలో సందడి చేసిన సైబీరియా పక్షులు సొంతింటికి పయనమవుతున్నాయి. తొలకరి జల్లులు కురిసే సమయానికి ఇక్కడకు వచ్చిన విదేశీ విహంగాలకు ఈ ఏడాది ప్రకృతి అనుకూలించక పోడంతో కొన్ని పక్షులు మృతి చెందగా, ఇంకొన్ని గుడ్లు పొదిగి పిల్లలతో వెళ్లిపోతున్నాయి. ఈ ఏడాది పక్షులు అధిక సంఖ్యలో తేలుకుంచి చేరుకున్నప్పటికీ వర్షాలు అంతగా లేకపోవడంతో పాటు పక్షులకు ఆహార కేంద్రాలైన పంట పొలాలు, చెరువుల్లో నీరు లేకపోవడంతో కొంత వరకు ఆహారానికి ఇబ్బందులు పడ్డాయి. రైతులు మోటారు బోర్లతో పంటలు పండించడంతో ఇప్పటి వరకు గుడ్లు పెట్టి, వాటిని పొదుగుతూ వచ్చాయి. ఇప్పుడు పిల్లలను తీసుకుని సొంత గూటికి పయనమవుతున్నాయి.

– ఇచ్ఛాపురం రూరల్

నడిరోడ్డుపై దించేశారు

కాశీబుగ్గ: బస్సు నిండా ప్రయాణికులు ఎక్కారు. డ్రైవర్ బస్సు తీయడానికి సిద్ధంగా ఉన్నారు. కండక్టర్ కూడా తన టిమ్ తీసుకుని టికెట్లు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. కానీ అంతలోనే ప్రయాణికులందరినీ బస్సు నుంచి దింపేసి ఖాళీ బస్సును డిపోకు తీసుకెళ్లిపోయారు. కారణం.. టిమ్‌లో పేపర్ రీల్ లేకపోవడమేనట. మందస మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఏడు గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. పలాస–మందస–పలాస బస్సు మందసలో నిండు ప్రయాణికులతో బయల్దేరడానికి రెడీ అయ్యింది. మహిళా కండక్టర్ టిక్కెట్లు ఇచ్చే పేపర్ రీల్ మర్చిపోవడంతో చేసేది లేక అందరినీ అక్కడే దించేశారు. రాత్రివేళ కావడంతో కొందరు ప్రత్యామ్నాయం చూపాలని బతిమలాడారు. అయినా తామేమీ చేయలేమని వారిని దించేసి ఖాళీ బస్సును తీసుకెళ్లిపోయారు. ఈ విషయంపై పలాస ఆర్టీసీ డిపో మేనేజర్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.



ప్రయాణికులను దించి వెళ్లిపోతున్న ఆర్టీసీ బస్సు

క్లుప్తంగా

దేవీ పీఠం సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



దేవీ సన్నిధిలో జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి జాతీయ రహదారికి అనుకొని ఉన్న కుంచాలకూర్మయ్యపేటలోని దేవీ పీఠాన్ని ఆదివారం సందర్శించారు. రాజరాజేశ్వరీ దేవిని, మహా లింగాన్ని, 1116 లింగాల దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో పీఠాధిపతి బాలభాస్కర శర్మ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లారీని ఢీకొట్టిన బొలేరో



నుజ్జునుజ్జు అయిన బొలేరో వాహనం

సోంపేట: మండలంలోని కొర్లాం జాతీయ రహదారి వద్ద ఆదివారం ఉదయం బొలేరో వాహనం లారీని ఢీకొంది. బారువ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇచ్ఛాపురం నుంచి పలాసవైపు వెళ్తున్న లారీని, ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వస్తున్న లారీ వెనుకనుంచి ఢీకొంది. దీంతో బొలేరో వాహనం నుజ్జునుజ్జు అయ్యింది. తీవ్ర ప్రమాదం జరిగినప్పటికీ ప్రాణనష్టం జరగలేదని బారువ ఎస్ఐ హరిబాబునాయుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

మద్యం నిల్వలపై ఆకస్మిక దాడులు



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం గ్రామంలో లంకలపల్లి మధుసూదనరావు వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 174 మద్యం బాటిళ్లను జేఆర్‌పురం పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ చిరంజీవి తన సిబ్బందితో అక్రమ మద్యం నిల్వలపై దాడులు నిర్వహించారు. దీనిపై కేసు నమోదు చేసి మధుసూదనరావును అరెస్టు చేశామని తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి



వృద్ధురాలు నారాయణమ్మ

జి.సిగడాం: మండలంలోని పాలఖండ్యాం గ్రామానికి చెందిన ధారబోయిన నారాయణమ్మ (100) ఆదివారం మృతి చెందింది. ఈమె కుమారుడు వెంకట అప్పారావు గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు.

ముస్లిం కాలనీ స్థలం కబ్జాకు యత్నం



జేసీబీతో చదును చేస్తున్న స్థలం ఇదే

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి సూదికొండ ప్రాంతంలో ముస్లింలకు చెందిన ప్రభుత్వ కాలనీ స్థలాన్ని కొంతమంది కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. సర్వే నంబర్ 38లో ముస్లిం సామాజిక వర్గానికి చెందిన కాలనీ ఇళ్లు ఉన్నాయి. కాలనీ ఇళ్లకు సంబంధించిన మరుగుదొడ్లను 1996లో ప్రభుత్వం నిర్మించింది. కాలనీ పక్కనే అప్పట్లో ప్రభుత్వం మసీదు నిర్మాణ కోసం కొంత స్థలం మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ మసీదుకు కేటాయించిన స్థలంతో పాటు మరుగుదొడ్లను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమిస్తున్నారు. మరుగుదొడ్లను ప్రొక్లెయినర్‌తో శనివారం ధ్వంసం చేశారు. గతంలో ఈ స్థలాన్ని ఒక టీడీపీ నాయకుడు ఆక్రమించేందుకు ప్రయత్నించగా, దీనిపై పలాస కోర్టులో (ఓఎస్ 56–2017) కేసు నడుస్తోంది. నూర్జహా బేగం, హసీనా పర్వీన్, రెహనాలు కోర్టులో వాజ్యం వేశారు. ఈ కేసుపై ఈనెల 14న అదాలత్‌లో రాజీ ప్రయత్నాలు జరుగుతుండగా, రాజీకి తూట్లు పొడుస్తూ శనివారం కొంత మంది ప్రొక్లెయిన్లతో వారికి సంబంధించిన మరుగుదొడ్ల గోడలను పడగొట్టేశారు. ప్రభుత్వ కాలనీ ఆక్రమణపై స్థానిక రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని పట్టాదారులైన ముస్లిం మహిళలు కోరుతున్నారు.

డిజిటల్ అరెస్ట్.. బీ అలెర్ట్



- సైబర్ నేరాల్లో సరికొత్త ట్రెండ్
- ఫేక్ కోర్టు ఆర్డర్‌తో మోసం
- పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయంటూ బెదిరింపు
- జిల్లాకు పాకుతున్న ఈ తరహా మోసాలు

శ్రీకాకుళం క్రైమ్: దేశవ్యాప్తంగా డిజిటల్ అరెస్టులు వణికిస్తున్నాయి. సైబర్ నేరాల్లో ప్రస్తుతం ఈ తరహా మోసాలే ట్రెండ్‌గా నిలుస్తున్నాయి. జిల్లాలో సైతం ఇప్పుడిప్పుడే ఈ తరహా ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మోసపోయేవారు పరువు పేరుతో భయపడి ఫిర్యాదు ఇవ్వడానికి వెనకడుగు వేస్తుండడంతో, యథేచ్ఛగా సైబర్ దొంగలు డబ్బులు దోచేస్తున్నారు.

వీరే టార్గెట్

సమాజంలో పలుకుబడి ఉండి బయట ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్న పిల్లలను, ఇంజినీరింగ్, ఐటీ ఉద్యోగుల తల్లిదండ్రులను, ప్రభుత్వ ఉద్యోగులను, వైద్యులను వీరు లక్ష్యంగా చేసుకుంటున్నారు. వీళ్ల ఫోన్ నంబర్లను తెలుసుకుని హ్యాకర్లు బ్లాక్‌మెయిల్ చేయడం, పిల్లలపై వీరికున్న అమిత ప్రేమను బలహీనతగా వాడుకుని ఒక్క ఫోన్ కాల్ తోనే తీవ్ర భయోత్పాతాన్ని (దూరంగా ఉన్న మీ బాబును డిజిటల్ అరెస్టు అంటూ) సృష్టించి క్యాష్ చేసుకుంటున్నారు.

నమ్మేలా సెటప్

సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి తాము సీబీఐ, నార్కోటిక్స్, ఇంటిలిజెన్సు లాంటి విభాగపు అధికారులమని నమ్మేలా ప్రవర్తిస్తారు. ఆ అధికారుల ఫేస్‌బుక్ ఖాతాల్లో పోలీసుల ఫేక్ ఫొటోలు పెట్టి పిల్లలు ఎక్కడ ఏ దేశంలో చదువుతున్నారు అనే వివరాలు ఈజీగా సంపాదించి, తర్వాత వారి తల్లిదండ్రులకు బ్లాక్ మెయిల్ చేయడం మొదలుపెడతారు. మీ అబ్బాయి పేరు ఇదేనా, మీ పేరు ఇదేనా అంటూ స్టార్ట్ చేసి మనం కంగారు పడేలా చేస్తారు. మీ వాడికొచ్చిన పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయి, మరి కొద్ది క్షణాల్లో కస్టమ్స్ అధికారులు అరెస్టు చేస్తారంటూ బెదిరిస్తారు. దీంతో ఏదోలా మన బిడ్డ బయటపడాలంటూ వారు కోరిన సొమ్ము బదలాయింపు చేస్తారు. వీడియో కాల్ చేసేటప్పుడు పోలీసు యూనిఫాంలో కనిపించడం, వెనుక కూడా మూడు సింహాలుండే పెద్ద పెద్ద లోగోలు ఉండేటట్లు అంతా ఆఫీస్‌ను సెటప్ చేయడం చేస్తుంటారు.



ఫిర్యాదు చేయాలి

జిల్లాలో డిజిటల్ అరెస్టులకు సంబంధించి ఎటువంటి కేసులు నమోదు కాలేదు. జరుగుతున్నట్లు సమాచారమైతే ఉంది. కానీ ఫిర్యాదు ఇవ్వడానికి చాలా మంది వెనుకంజ వేస్తున్నారు. సీబీఐ, కస్టమ్స్, ఇంటిలిజెన్సు అధికారులమంటూ వీడియో కాల్స్ చేసి మీ పిల్లలు డ్రగ్స్‌తో దొరికారన్న వీడియో కాల్స్ వస్తే తక్షణమే కట్ చేయాలి. పిల్లలను అరెస్టు చేస్తాం.. జైలుకు పంపిస్తామంటే బెదిరిపోకూడదు. ముందుగా మన పిల్లలకు ఫోన్ చేసి ఎక్కడ, ఎలా ఉన్నారన్నది సమాచారం తెలుసుకోవాలి. అటువంటి కాల్స్ వస్తే సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో తప్పక ఫిర్యాదు ఇవ్వాలి. లేదంటే జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సంప్రదించాలి.

– కె.వి.మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం జిల్లా

కేవైసీనే కారణమా..?

ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు ఖాతా, మొబైల్ నెంబర్లతో కేవైసీ లింక్ చేసేటప్పుడు వివరాలు ఆదాయపు పన్ను శాఖకు వెళ్లి సమాచారం మొత్తం ఇన్‌సెట్ అయి ఉంటుంది. దీని నుంచి హ్యాకర్లు డేటా తస్కరించే వీలుందన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అలాగే ప్రైవేటు సెల్ నెట్‌వర్క్‌లు నుంచి సైతం లీకులు ఉన్నట్లు సైబర్ నిపుణుల బృందం భావిస్తున్నారు. వీటి ఆధారంగా మన మొబైల్ లొకేషన్‌ను ట్రేస్ చేసి ఎక్కడున్నామన్నది నేరగాళ్లు ఇట్టే కనిపెడుతుంటారు. జిల్లాలో ఇలాంటి ఫేక్ కాల్స్‌లో ఇప్పుడిప్పుడే చాలా మంది రూ.లక్షల్లో పోగొట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో ఘటనలు...

- తాజాగా జిల్లా కేంద్రంలోని ఒక యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగపు ప్రిన్సిపాల్‌కు సైబర్ కేటుగాళ్లు ఇదే తరహాలో ఫేక్ కోర్టు ఆర్డర్ పంపించి డిజిటల్ అరెస్టు బూచి చూపడంతో బెదిరిపోయారు.
- ఈ ఏడాది ఆగస్టులో ఇలాగే ఫేక్ కోర్టు ఆర్డర్ పంపించి జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బెన్‌హర్‌ను బుట్టలో వేయడానికి ప్రయత్నించారు. ఫేక్ కోర్టు ఆర్డర్ కాపీకి జతగా డైరెక్టర్ ఆఫ్ ఇంటిలిజెన్సు బ్యూరో, చీఫ్ ఆఫ్ పోలీస్ (ప్రాసిక్యూటర్ ఓవర్ మైనర్స్ అండ్ అఫెన్సెస్ రిలేటెడ్ టు సైబర్ క్రైమ్) సంతకాలతో కూడిన లెటర్ కాపీలను పంపించి చిన్నపిల్లల నీలిచిత్రాలు తీశారంటూ బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.
- తాజాగా జిల్లాలోని ఓ వ్యక్తికి బెంగుళూరు చదువుతున్న తమ కుమార్తెను డిజిటల్ అరెస్టు చేస్తామంటూ ఫోన్ చేయడంతో బెదిరిపోయారు. కానీ పరువు సమస్య రావడంతో పోలీసులకు ఫిర్యాదివ్వడానికి ముందుకు రాలేదు. దీంతో పోలీసులు సాయం చేద్దామన్నా ఫిర్యాదు లేకపోతే విచారణలో ముందుకెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఈయన కొంత డబ్బులు పోగొట్టుకున్నట్లు వినికిడి.

రామభక్తుల పాదయాత్ర



రామతీర్థానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

ఎచ్చెర్ల: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన 150 మంది రామభక్తులు విజయనగరం జిల్లాలోని ప్రసిద్ధి గాంచిన దైవక్షేత్రం రామతీర్థానికి పాదయాత్రగా ఆదివారం పయనమయ్యారు. ఈ బృందానికి లావేటిపాలేం, కేశవరాయపురం గ్రామాల్లోని ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో రామభక్తులతో పాటుగా మహిళా యాత్రికులు పాల్గొన్నారు.

ఫర్నీచర్ షాపు దగ్ధం



సీతారాంపురంలో కాలిపోయిన కార్పెంటర్ షాపు

రణస్థలం: మండలంలోని తెప్పవలస పంచాయతీ పరిధి సీతారాంపురం గ్రామంలో కార్పొంటర్ పని చేసుకునే పూరిపాక శనివారం రాత్రి అగ్నికి ఆహుతైంది. దీంతో అందులో ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. అరసవల్లి సత్యం కార్పెంటర్(వడ్రంగి) పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చుట్టుపక్కల 50 గ్రామాల్లో ఎవరికీ ఎటువంటి తలుపులు, కిటికీలు, ఎండ్లు బండ్లు కావాలన్నా అతనే చేసి పెడుతున్నాడు. వీటికి సంబంధించిన మెటీరియల్ రూ.10 లక్షలకు పైచిలుకు కర్రలు, తలుపులు, ద్వారాలు ఇలా ఇతర ఫర్నీచర్ ఉన్నాయి. ఇవన్నీ శనివారం రాత్రి 1.30 సమయంలో అనుకోకుండా కాలిపోయాయి. ఈ ప్రమాదం ఎలా జరిగిందో తెలియదు. గ్రామస్తులు గుర్తించి మంటలు ఆర్పేలోపే మొత్తం కార్పెంటర్ ఫర్నీచర్ పూరిల్లు పూర్తిగా దగ్ధమైపోయింది. అర్ధరాత్రి అగ్నిమాపక వాహనానికి ఫోన్‌చేసి అప్పటికే గ్రామస్తులు మంటలను ఆర్పేశారు. దీనిపై రణస్థలం అగ్నిమాపక అధికారి పైల ఆశోక్ మాట్లాడుతూ రాత్రి 1.35 గంటలకు సీతారాంపురం నుంచి ఫోను వచ్చిందని, కానీ బయల్దేరి వెళ్లేలోపే గ్రామస్తులు ఆర్పేసినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో కార్పెంట్ ఫర్నీచర్ వస్తువులు బాగా కాలిపోయాయి. పూర్తిస్థాయిలో నివేదిక సిద్ధం చేసి రిపోర్టు ఇస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్న హైవే అంబులెన్స్ సిబ్బంది

సోంపేట: మండలంలోని బేసి రామచంద్రాపురం జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బారువ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాతపట్నం గ్రామానికి చెందిన చల్లా రామారావు, బైరాగిలు ఒక ద్విచక్ర వాహనంపై సోంపేటలో శుభకార్యానికి వస్తున్నారు. అదే విధంగా పలాసకు చెదిన శ్రీదేవి, కుమారుడు లోకేష్‌తో కలిసి సోంపేట వస్తున్నారు. కాగా బేసి రామచంద్రాపురం జాతీయ రహదారి వద్ద ముందు వెళ్తున్న రామారావు ద్విచక్ర వాహనాన్ని లోకేష్ వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో లోకేష్‌తో పాటు, రామారావు, బైరాగిలకు స్వల్ప గాయాలయ్యాయి. సోంపేట సామాజిక ఆస్పత్రికి బాధితులను తరలించి చికిత్స అందజేశారు. బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన లారీ

- డ్రైవర్ మృతి



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ (ఇన్‌సెట్లో) మృతి చెందిన లారీ డ్రైవర్ షేక్ ఫరీద్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట కొయ్యరాళ్ల కూడలి వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం 6.30 గంటల సమయంలో శ్రీకాకుళం వైపు వస్తున్న లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ లారీ తమిళనాడు నుంచి కొబ్బరికాయల లోడ్‌లో ఝార్ఖండ్ రాష్ట్రం ధన్‌నగర్ వెళ్తోంది. నిద్ర మత్తులో డ్రైవర్ షేక్ ఫరీద్ (36) సర్వీస్ రోడ్డునున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. బలంగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టటంతో వాహనం ఆగిపోయింది. లేదంటే సమీప ఇళ్లలోకి లారీ చొచ్చుకు వచ్చేది. ఇదే సమయంలో సర్వీస్ రోడ్డులో వాహనాలు రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ స్తంభం నుంచి శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని గుజరాతిపేట సబ్‌స్టేషన్ నుంచి 33 కేవీ లైన్ ద్వారా అరిణాం అక్కివలసలోని నాగార్జునా అగ్రికెం పరిశ్రమకు విద్యుత్ సరఫరా అవుతోంది. అలాగే ఈ లైన్ కింద నుంచి ఎచ్చెర్ల సబ్‌స్టేషన్ నుంచి 11 కేవీ లైన్ ద్వారా ఫరీదుపేట గ్రామానికి విద్యుత్ సరఫరా అవుతోంది. ప్రమాదం సమాచారం తెలియడంతో వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. స్థానికులు స్పందించి డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకు తీశారు. క్యాబిన్ వెనుక ఉన్న బెడ్‌లో నిద్రిస్తున్న క్లీనర్ ఇస్మాయిల్ సైఫ్ రసూల్ సురక్షితంగా బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌కు స్థానికులు, హైవేపై వెళ్తున్న వాహన చోదకులు సీపీఆర్ చేశారు. అయితే 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి చూసేసరికి డ్రైవర్ ప్రాణాలు విడిచారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు అంబులెన్స్‌లో తరలించారు. మృతి చెందిన డ్రైవర్‌ది తమిళనాడు రాష్ట్రం దిండిగల్ జిల్లా జిన్నానగర్. ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ఉదయం 10 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా రాణించాలి



నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆర్యవైశ్యులు వ్యాపార రంగంలోనే కాకుండా రాజకీయంగా రాణించాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ అన్నారు. పట్టణంలోని వరం రెసిడెన్సీలో ఆర్య వైశ్యుల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులకు రక్షణ కావాలంటే ఏదో ఒక పార్టీ జెండా కిందకు మనమంతా వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కనీసం భావితరాల వారికైనా రాజకీయాల్లోకి అవకాశం కల్పించేలా చూడాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకి కావాల్సిన సహాయ సహకారం తన వంతుగా అందిస్తానన్నారు. తమ కులానికి అండ లేకపోతే తొక్కేస్తారని, తస్మాత్ జాగ్రత్త అని హితవు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఏ సాయం కావాలన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ జిల్లా అధ్యక్షుడు పేర్ల సురేష్ మాట్లాడుతూ.. కులాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గంలో ఎన్నికైన వారంతా అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. జిల్లాలో తమ కులానికి చెందినవారికి ఏ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గౌరవ అధ్యక్షుడిగా ఎం.ఎస్.ఎస్.గుప్త, అధ్యక్షుడిగా పేర్ల సురేష్, కార్యదర్శి బత్తుల శ్రీనివాస్, ట్రెజరర్ మగటపల్లి మల్లిఖార్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడిగా పిప్పల వెంకటరమణమూర్తితో పాటు మరో ఐదుగురిని, సంయుక్త కార్యదర్శిగా మండవల్లి రవితో పాటు మరో ఆరుగురు, ఎగ్జిక్యూటివ్ బాడీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

జగన్ హయాం పాఠశాలలకు స్వర్ణయుగం

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త తిలక్



టెక్కలి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాం ప్రభుత్వ పాఠశాలలకు స్వర్ణయుగమని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. ఇటీవల కోటబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీటీఎం సమావేశంలో భాగంగా గత ప్రభుత్వంలో చేపట్టిన నాడు–నేడు పనులపై మంత్రి అచ్చెన్నాయుడు చేసిన విమర్శలను ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అచ్చెన్నాయుడు తన సొంత గ్రామం నిమ్మాడలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి విమర్శలు చేయాలని సూచించారు. గతంలో టీడీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు ఎలా ఉండేవో గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకాన్ని అందజేయాలని సూచించారు. తల్లికి వందనం పథకం నుంచి డైవర్ట్ చేయడానికే పీటీఎం సమావేశాల పేరుతో ఆర్భాటాలు చేస్తున్నారని మండిపడ్డారు. పాఠశాలల్లో తాము తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, అటువంటి కార్యక్రమాలపై అవగాహన లేక మంత్రి అర్థం లేని వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు.

పెరిగిన రుణ పరపతి

- రైతన్నకు రుణ పరిమితి రూ.2 లక్షలకు పెంచిన ఆర్‌బీఐ
- అరకొరగానే పెంపు ప్రయోజనం
- పట్టించుకోని అధికారులు



పుటియాదళలో ఖరీఫ్ వరిపంట

కవిటి:

ఆరుగాలం శ్రమించే అన్నదాతకు వడ్డీ వ్యాపారుల నుంచి రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు, ఆదిశగా ఆలోచించడం లేదు అన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. రైతు తనకు వారసత్వంగా సంక్రమించిన భూమిపై రుణాన్ని పొందే వీలుందన్న వాస్తవాన్ని తెలుసుకోలేని అయోమయంలో పడుతున్నాడు. ఆ పరిస్థితి నుంచి గట్టెక్కించాల్సిన వ్యవసాయ అనుబంధ శాఖలు ఈ పని తమది కాదన్నట్టుగానే వ్యవహరిస్తున్నాయి. ప్రధానంగా ప్రభుత్వరంగ బ్యాంకుల్లో రుణ వితరణ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. రుణాల దరఖాస్తు చేసుకున్న రైతుకు రుణ మంజూరీ ప్రక్రియ సరళతరం నుంచి సంక్లిష్ట స్థితికి చేరుకోవడం అన్నదాతల పాలిట శాపంగా మారింది. రిజర్వ్ బ్యాంక్ 2019 ఖరీఫ్ నుంచి సవరించిన మార్గదర్శకాల మేరకు పంటరుణం మొత్తాన్ని ఎటువంటి పూచీకత్తులు సమర్పించకుండానే రూ.1.60 లక్షలు పొందే వీలుకల్పించింది. అయితే తాజాగా ఆర్‌బీఐ రైతులకు అందించే కిసాన్ క్రెడిట్ కార్డు రుణాల పరిమితిని రూ.2 లక్షలకు పెంచుతున్నామని ప్రకటించింది. ఎటువంటి పూచీకత్తు లేకుండానే ఈ మొత్తాన్ని నాలుగు ఎకరాల వరి, కొబ్బరి, చెరకు తదితర ప్రధాన పంటలు పండిస్తున్న భూమి ఉన్న రైతులకు లభిస్తుంది. దీనిపై వడ్డీ 7 శాతంగానే ఉంటుంది. అయితే ఈ మొత్తంలో రూ.1 లక్ష వరకు 7 శాతం వడ్డీ కాగా, కేంద్ర ప్రభుత్వం 4 శాతం రాయితీ కల్పిస్తే పావలా వడ్డీకే దక్కుతుంది. మిగిలిన రూ.1 లక్షకు 7 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుత స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ గమనిస్తే కేవలం రెండు ఎకరాల చెరకు, అరటి పంటల సాగు తోట ఉన్న రైతులకు సులువుగానే రూ.2 లక్షల రుణం దక్కే అవకాశం ఉంది. నాలుగు ఎకరాల వరి పంట భూమి ఉన్న రైతుకు ఈజీగా రూ.2 లక్షల రుణం కేవలం నూటికి 0.58 పైసల వడ్డీకి పొందే అవకాశం ఉందన్న వాస్తవం తెలియని రైతులు ఎందరో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఈ నిర్ణయంతో జిల్లాలో వరిసాగుచేసే సుమారు 4.50లక్షల మంది సన్న, చిన్నకారు, పెద్ద రైతులకు ప్రయోజనం నెరవేరనుంది. 32,565 ఎకరాల్లో కొబ్బరిసాగు చేస్తున్న 2.12 లక్షల మంది కొబ్బరి రైతులకు ఈ పెంపుదల లాభించనుంది.

రుణాల మంజూరులో కాలయాపన

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐలో రైతులకు అందిస్తున్న పంట రుణాల జారీ ప్రక్రియలో తీవ్రకాలయాపన నెలకొనడం విచారకరం. మరో పక్క ఇదే అదునుగా ప్రైవేట్ బ్యాంకులు తక్కువ కాలపరిమితిలో అంతకన్నా అధిక వడ్డీకి రైతులకు రుణాలు అందించగలుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ రంగ బ్యాంకులకు సంబంధించి జిల్లాలో ఎంపిక చేసిన మూడు కేంద్రాల్లో రైతులు పంటరుణం కోసం చేసుకున్న దరఖాస్తు స్క్రూట్నీ చేస్తున్నారు. ఆ ప్రక్రియ సజావుగా సకాలంలో పూర్తి కాకపోవడంతో రుణం పొందడం రైతులకు కాలయాపనకు దారితీస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంతకు ముందు ఈ విధానం లేకపోవడంతో బ్యాంకు మేనేజర్ స్థాయిలోనే రుణం మంజూరు జరిగిపోయేది. దీంతో బ్యాంకు రుణం అంటే భయపడే స్థాయికి రైతన్నలు ప్రైవేట్ రుణాలకోసం చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

సద్వినియోగం చేసుకోవాలి



రిజర్వ్ బ్యాంక్ వ్యవసాయరంగంలో వచ్చిన పంట పెట్టుబడులు, రాబడి, ఖర్చులు, ద్రవ్యోల్బణం తదితర అంశాలను ప్రామాణికంగా రుణానికి నిర్ధేశించిన పంటలకు కొత్త స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లను సూచిస్తూ పెంపుదల చేసింది. అయితే ఇందుకు సంబంధించి బ్యాంకులకు మార్గదర్శకాలు కూడా వెలువరించడం జరుగుతుంది. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

– దేవరాజ్ సాహూ, కవిటి పీఏసీఎస్ మాజీ చైర్మన్

బ్యాంకులు ఉదారంగా వ్యవహరించాలి



ఆర్‌బీఐ తాజాగా ప్రకటించిన కిసాన్ క్రెడిట్ కార్డుపై పంట రుణ పరిమితి రూ.2 లక్షలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం ఎంతో ఊరటనిచ్చే అంశం. అయితే వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు ఈ విషయాల్ని రైతులకు సరైన సమాచారం రైతు సేవాకేంద్రాల ద్వారా అందించగలిగే రైతులందరికీ భారీస్థాయిలో ప్రైవేట్‌వడ్డీ వ్యాపారుల నుంచి నష్టాలు తగ్గి భారం లేకుండా ఉంటుంది. బ్యాంకులు ఉదారంగా రుణాలు అందించగలగాలి.

– పొందల శ్రీరాంబాబు, రైతు, కవిటి మండలం